## ప్రజల భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి సాధ్యం : కమిషనర్ శరత్ చంద్ర




**దశ, నల్గొండ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన “ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక” కార్యక్రమంలో భాగంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలువురు డివిజన్లలో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర డివిజన్ 15, 16లలో జరిగిన సభలకు హాజరై ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2026, నాలుగు రకాల చెత్త వేరు చేసే విధానం, వర్షపు నీటి సంరక్షణ, డ్రైనేజీల శుభ్రత, వర్షాకాల సన్నద్ధత చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రహదారులు తదితర సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందని, రాబోయే వార్డు సభల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొనాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

## న్యాయం చేయమన్నందుకు అరెస్టు



**దశ, రంగారెడ్డి:** రైతులకు న్యాయం చేయమని అడిగినందుకు సొంత పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అరెస్టు చేయించారని స్థానిక నేతలు ఆరోపించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కోహెడలో ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం రైతుల నుండి ప్రభుత్వం భూసేకరణ చేస్తుంది. భూమి కోల్పోతున్న రైతులకు న్యాయపరమైన పరిహారం ఇవ్వాలని ఆందోళనకు దిగిన కోహెడ కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసారు. గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం, మల్రెడ్డి రంగారెడ్డి కోసం పనిచేశామని, ఇప్పుడు రైతులకు న్యాయం చేయమని అడిగినందుకు మమ్మల్నే అరెస్ట్ చేస్తున్నారని న బాధిత కాంగ్రెస్ కార్యకర్తలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వర్షా కాల సన్నద్ధతపై గ్రామసభల సమీక్ష



**దశ, కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తర్నికల్, తర్నికల్ తాండా, సుద్దికల్, తాండ్ర, ఎల్లికల్, జంగారెడ్డిపల్లి గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో వర్షాకాల సన్నద్ధత, తాగునీటి భద్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, వనమహోత్సవం కింద మొక్కల పెంపకం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరద నిరోధక చర్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి సమీక్షించారు. గ్రామసభలకు హాజరైన ప్రజలకు మండల స్థాయి అధికారులు ఆయా కార్యక్రమాల అమలు విధానాన్ని వివరించారు. ముఖ్యంగా వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా డ్రెయిన్‌లను శుభ్రపరచడం, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే మార్గాలను గుర్తించడం, తాగునీటి నాణ్యతను నిరంతరం పరిశీలించడం, అవసరమైన చోట్ల ఫిల్టరేషన్ సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలపై సూచనలు చేశారు.అలాగే ఘన వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి నిర్వహించడం, పునర్వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఐటీ కారిడార్‌లో బైక్ స్టంట్లు, రేసింగ్‌లపై పోలీస్ ఉక్కుపాదం

❖ *ఐదుగురు అరెస్ట్, 5 బైక్‌లు, కారు సీజ్*



**దశ, హైద్రాబాద్ :** ఐటీ కారిడార్, టీహబ్ పరిసర ప్రాంతాల్లో వీకెండ్స్‌లో బైక్ స్టంట్లు, ప్రమాదకర రేసింగ్‌లతో హల్‌చల్ చేస్తున్న పోకిరీలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రీల్స్ పిచ్చితో రోడ్లపై ప్రాణసంకటంగా మారుతున్న వాహనదారులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, కఠిన చర్యలు చేపట్టారు. ఈ డ్రైవ్‌కు సంబంధించిన వివరాలను కూకట్‌పల్లి డీసీపీ రితి రాజ్ మీడియాకు వెల్లడించారు. ఐటీ కారిడార్, టీ హబ్, ఐకియా (IKEA) పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా అర్ధరాత్రి, వీకెండ్స్ సమయంలో యువత ప్రమాదకర రీతిలో బైక్ స్టంట్లు, రేసింగ్‌లకు పాల్పడుతున్నారు. దీనివల్ల స్థానిక నివాసితులకు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తీవ్ర అసౌకర్యం కలగడమే కాకుండా, సాధారణ ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. పైగా, అక్కడ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసుల విధులకు కూడా కొందరు పోకిరీలు ఆటంకం కలిగిస్తున్నారు, తాజా డ్రైవ్‌లో భాగంగా ప్రమాదకరంగా బైక్ స్టంట్లు చేస్తున్న ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుండి రేసింగ్‌కు ఉపయోగిస్తున్న 5 బైక్‌లను, ఒక కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు డీసీపీ తెలిపారు. కేవలం ఇన్‌స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీల్స్ చేసి, వ్యూస్ సంపాదించడం కోసమే సిటీ చుట్టుపక్కల ప్రాంతాల నుండి యువత ఇక్కడికి వస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఇలాంటి ప్రమాదకరమైన స్టంట్ల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, తోటి యువతను తప్పుదోవ పట్టిస్తున్న 35 సోషల్ మీడియా ఖాతాలను పోలీసులు ప్రత్యేకంగా గుర్తించి ఖాతాల నిర్వాహకులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. పట్టుబడిన నిందితులపై కేవలం సాధారణ ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు మాత్రమే కాకుండా... భారతీయ న్యాయ సంహిత (BNS), మోటార్ వాహనాల చట్టం (MV Act) 1988, మరియు ఐటీ యాక్ట్ 2000 లోని వివిధ కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు.



## గాలి దుమారంతో ఇల్లు ధ్వంసం.. బాధిత కుటుంబానికి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ రూ.10 వేల సాయం

**దశ హయత్ నగర్:** ఉమ్మడి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్టలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం, ఈదురుగాలుల కారణంగా నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి గోడ కూలి పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడింది. దీంతో ఆ ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఘటన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న వెంటనే జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం బాధితుడు శేఖర్ యాదవ్‌ను పరామర్శించి, ట్రస్ట్ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఇంటి యజమానులతో మాట్లాడిన రఘువీర్ రెడ్డి, ధ్వంసమైన రేకుల ఇంటిని తిరిగి నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేకేఎల్ గౌడ్, నర్సింహ యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు చంద్రారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఫ్రీ లాంచ్ పేరుతో రూ.100 కోట్ల టోకరా..!



❖ *మరో భూదొంగ అరెస్టు.*
❖ *బ్రేక్‌ఫాస్ట్ చేస్తుండగా హోటల్‌లోనే అదుపులోకి తీసుకున్న పోలీసులు.*

**దశ, హైదరాబాద్:** పెట్టుబడుల పేరిట వందలాది మందిని మోసం చేసి కోట్ల రూపాయలు దోచుకున్న మెసారా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత మారెళ్ళ పెంచల సుబ్బారెడ్డిని మాదాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ కొల్లూరులో వివాదాస్పద భూములను తమవిగా చూపిస్తూ “ఫ్రీ లాంచ్ వెంచర్లు” పేరుతో సుమారు రూ.100 కోట్ల వరకు వసూలు చేసి పరారీలో ఉన్న అతడిని శనివారం ఉదయం హైటెక్ సిటీలోని ఓ హోటల్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుబ్బారెడ్డి హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్న బాధితులు వెంటనే మాదాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ, ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో అతనిపై పలు కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం. తెలంగాణ వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్పను కోటి రూపాయలకు మోసం చేసిన కేసులో కూడా గద్వాల పోలీస్ స్టేషన్‌లో సుబ్బారెడ్డి పై కేసు నమోదై ఉంది. గత రెండేళ్లుగా వివాదాస్పద భూములను ఆకర్షణీయమైన బ్రోచర్లతో ప్రచారం చేస్తూ వందలాది మందిని నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. లేని భూములను ఉన్నట్లు చూపించి కోట్ల రూపాయలు వసూలు చేసి పరారీలో ఉన్న సుబ్బారెడ్డి ఎట్టకేలకు పోలీసులకు చిక్కడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు.

# యోగితా రాణా ఆదేశాలు బేఖాతరు..!



❖ *ప్రభుత్వ విద్యకు పెద్దపీట అంటూనే*
❖ *పేద విద్యార్థుల భవిష్యత్తుపై నిర్లక్ష్యం?*

**దశ, ఆసిఫాబాద్:** ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పెంచాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 202627 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో 100 శాతం సీట్ల భర్తీ లక్ష్యంగా పని చేయాలని వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం భిన్నంగా కనిపిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పెంచాలని ఉన్నతాధికారులు చెబుతుంటే, మరోవైపు ఆసిఫాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్‌కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి సంబంధించిన సమస్యపై జిల్లా కలెక్టర్ కె. హరితను కలిసి వినతి పత్రం అందజేసిన జర్నలిస్టుకు "నేను ఏమీ చేయలేను" అనే సమాధానం రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సమావేశాల్లో పెద్ద పెద్ద ప్రకటనలు చేస్తున్న అధికారులు, పేద విద్యార్థుల ప్రవేశ సమస్యల పరిష్కారంలో మాత్రం చేతులెత్తేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీట్లు నింపాలన్న లక్ష్యాలు కాగితాలకే పరిమితమవుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

విద్యార్థుల నమోదు పెంపు, బడిబాట కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనపై అధికారులు గొప్పలు చెబుతున్నప్పటికీ, ప్రవేశాల కోసం తిరుగుతున్న పేద విద్యార్థులకు న్యాయం జరగకపోతే ఆ కార్యక్రమాల ప్రయోజనం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. "ప్రభుత్వ విద్యలో ప్రవేశాలు పెంచాలని ఆదేశాలు ఒకవైపు... ప్రవేశం కోసం వచ్చిన విద్యార్థులకు 'ఏమీ చేయలేం' అనే సమాధానం మరోవైపు... ఇదేనా విద్యా వ్యవస్థపై ప్రభుత్వ చిత్తశుద్ధి?" అంటూ జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బాల పంచాయతీలతో సురక్షిత గ్రామాలు

❖ *బాలల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర*
❖ *పిల్లల్లో నాయకత్వ లక్షణాల పెంపునకు కృషి చేయాలి*
❖ *ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు*

**దశ, మెదక్:** రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలో భాగంగా బాలల భద్రత వారోత్సవాలు పాపన్నపేట మండలంలోని మంజీరా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. పోలీస్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో, మై ఛాయిస్ ఫౌండేషన్, యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ కార్యక్రమంలో బాల పంచాయతీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి బాల పంచాయతీలు సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తాయని అన్నారు. గ్రామాల్లోని బాలబాలికల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేసేలా బాల పంచాయతీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై బాల పంచాయతీ ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాభివృద్ధి, బాలల సంక్షేమంలో పిల్లలను భాగస్వాములను చేయడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. బాలల అనుకూల వాతావరణం కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు సమష్టిగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, డీసీపీఓ నాగరాజు, సీసీఎస్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీఐడీ ఉమెన్ సేఫ్టీ వింగ్ సీఐ రాజేష్, రూరల్ సీఐ జార్జ్, యంగిస్తాన్ ఫౌండేషన్ ప్రతినిధి వృత్విక, విజన్ ఎన్జీఓ ప్రతినిధులు రాజు, యాదగిరి, తహసీల్దార్ సతీష్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, పీఎం శ్రీ పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, నాయకులు శ్రీకాంత్ అప్ప, మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు రాములు, కిష్టయ్య, నాయకులు శివయ్య, సంగమేష్, ప్రసాద్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, వివిధ గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
ఆదివారం
07-06-2026

# ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM




## ప్రోటోకాల్ పాటించని అధికారులపై మండిపడ్డ BRS నాయకులు



**దశ, అశ్వాపురం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కేంద్రంలో ఉన్నటువంటి రైతు వేదిక నందు స్థానిక MLA పాయం వెంకటేశ్వర్లు పర్యటనలో భాగంగా కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వేదికపై ప్రజాప్రతినిధులు కాకుండా పార్టీ నాయకులను పిలవడం చాలా విడ్డూరం అని అశ్వాపురం BRS పార్టీ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ అన్నారు. శనివారం ఆయన BRS పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమం లేదా పార్టీ కార్యక్రమామ అని ప్రశ్నించారు?గతంలో అధికారులు కూడా ఇలాంటి కార్యక్రమాలను ప్రొచ్చహించడంతో సంబంధిత అధికారులకి ప్రశ్నించగా మారాల ఇటువంటి పొరపాటు జరగనీయం అని మరలాకూడా అదే పద్ధతిని కొనసాగిస్తూ అధికారిక కార్యక్రమలను పార్టీ నాయకులతో నిర్వహిస్తున్నందున అతి ఉత్సాహం ప్రోత్సహించడంపై బిఆర్ఎస్ పార్టీ మండిపడింది. ఇట్టి విషయాన్ని సాక్షాధారాలతో కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు...అధికారులు ఇకనైనా తమ పద్ధతిని మార్చుకొని వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మండల BRS పార్టీ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం,సూదిరెడ్డి గోపిరెడ్డి,నియోజకవర్గ SC సెల్ అధ్యక్షులు వెన్న అశోక్ కుమార్,మండల యువజన అధ్యక్షులు గద్దాల రామకృష్ణ,చుంచు రామ్మూర్తి,కళ్యాణపురం సర్పంచ్ లకావత్ రామారావు,గుంపెన శ్రీను,శివారపు డాక్టర్ బాబు,కాట్రాజ్ కొండల్, తాటి వెంకటేశ్వర్లు,తోకల వెంకటేశ్వర్లు,మేకల భాస్కర్, కాలవ సంసోన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## రాకేష్ రెడ్డి ఈక్లాసెస్ యాప్ లాంచ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

❖ *చర్ల BRS పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు*




**దశ, చర్ల:** నిరుద్యోగ యువతకు నాణ్యమైన, ఉచిత పోటీ పరీక్షల శిక్షణ అందించాలనే లక్ష్యంతో కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో, Chakravarty EClassroom భాగస్వామ్యంతో రూపొందించిన "Rakesh Reddy EClasses App" లాంచ్ కార్యక్రమాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని దొడ్డి తాతారావు కోరారు. ఈ సందర్భంగా శనివారం చర్ల BRS పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఈ యాప్ ఒక గొప్ప అవకాశమని అన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన నాణ్యమైన కోర్సులు, స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత్వం పూర్తిగా ఉచితంగా అందుబాటులోకి రావడం అభినంద నీయమన్నారు. ఈ నెల 8వ తేదీ (సోమవారం) ఉదయం 10 గంటలకు కొత్తగూడెం క్లబ్, రైటర్ బస్తీలో నిర్వహించనున్న "Rakesh Reddy EClasses App Launch & Awareness Program కు జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ సాధన దిశగా ముందుకు సాగాలనుకునే ప్రతి యువకుడు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని, యాప్ ద్వారా అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజారాజు, కాకి అనిల్, తడికల బుల్లెబ్బాయి, కారం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణాపై ఉక్కుపాదం





❖ *మదకద్రవ్యాల వినియోగిస్తే కఠిన చర్యలు*
❖ *భద్రాచలం DSP అరుణ్ కుమార్*
❖ *భద్రాచలం అయ్యప్ప, రెవిన్యూ కాలనీల్లో పోలీసుల కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్*

**దశ, భద్రాచలం:** భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప కాలనీ, రెవెన్యూ కాలనీల్లో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరియైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 37 ద్విచక్ర వాహనాలను, 02 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి డిఎస్పి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని, గంజాయి,మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలియజేశారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించవలసిందిగా కోరారు.మహిళలు & పిల్లల భద్రత గురించి పలు సూచనలు చేశారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సంబంధిత అధికారులతో మాట్లాడి వారి పరిష్కారాన్ని కృషి చేస్తానని, విపత్కర సమయాలలో ఆపదలో ఉన్నప్పుడు డేల్ 100నకు ఫోన్ చేసి పోలీసువారి సేవలు పొందాలని సూచనలు చేశారు.

సుమారు 90 మందికి పైగా పోలీసు అధికారులు మరియు సిబ్బంది కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో పాల్గొన్నారు. ఈ ఆపరేషన్ లో భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, ఇన్స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిఆర్పిఎఫ్ సిబ్బంది, ట్రాఫిక్ మరియు స్టేషన్ల సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, నార్కోటిక్స్ స్నీఫర్ డాగ్ పాల్గొనడం జరిగింది.



## నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

❖ *భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్*

**దశ, ఇల్లెందు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పోలీస్‌స్టేషన్ పరిసరాలు అన్ని పరిశీలించారు. కేసుల నమోదు వివరాలు, ఆయుధాల రూం, సిబ్బంది వినియోగించే వాహనాలు, పరికరాలు అన్నిటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానితులపై నిఘా పెట్టాలని తెలిపారు. బ్లూ కోడ్స్ వాహనాలతో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని అన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు గౌరవం ఇస్తూ, తగిన న్యాయం చేసేందుకు పోలీసులు కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వెంటనే పరిష్కరించాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట ఇల్లెందు డిఎస్పి వెంకన్న బాబు, టేకులపల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి ఎస్సై రాజేందర్, ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలంలో PDSU నాయకులు అరెస్ట్



**దశ, భద్రాచలం:** ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడి అరికట్టాలని, ప్రభుత్వ నిబంధన ను విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు చేయాలని మంత్రుల నివాసం ముట్టడి PDSU రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్ వెళ్తున్న PDSU నాయకులను భద్రాచలం పోలీసులు శుక్రవారం రాత్రి భద్రాచలం బస్టాండ్‌లో అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా PDSU జిల్లా కార్యదర్శి మునిగెల శివప్రశాంత్ మట్లాడుతూ..ప్రైవేటు,కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ ఇష్టానుసారంగా జరుగుతుందన్నారు. విద్య ప్రజలకు భారంగా మారిందని, తెలంగాణలో ఫీజుల నియంత్రణ చట్టం చెయ్యాలని, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని PDSU రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడి నిర్వహిస్తు న్నామన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా విద్యారంగంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మాటలకు మాత్రమే పరిమితమయ్యారు. ముఖ్య మంత్రి గానే విద్యా శాఖ మంత్రిగా ఉన్న చిత్తశుద్ధిలేకుండా వ్యవహరిస్తున్నారు జూన్ 12 విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతుందని, తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని PDSU డిమాండ్ చేస్తూ నిర్వహించే భద్రాచలం డివిజన్ అధ్యక్షులు దండుగుల రామ్ చరణ్, పవన్ కళ్యాణ్ లు అరెస్టు నీ తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**దశ, అశ్వాపురం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన మొత్తం రూ. 38,42,408 విలువ గల చెక్కులను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో కల్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ సూర్యప్రకాష్, హౌసింగ్ ఏఈ ఉదయ్ కుమార్, ఎంపీపీ సూపరింటెండెంట్ పిచ్చేశ్వరరావు, ఆర్ఐ లీలావతి, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, తుక్కాని మధుసూదన్ రెడ్డి, వేములపల్లి రమేష్, సర్పంచులు సబ్కా పిచ్చయ్య, కోర్సా కృష్ణ, ఇర్పా కవిత, జిమ్మా ఝూన్సీ, కుంజా జాను, మూలమ్మ, లంకమల్ల కొండలరావు, సోడే వెంకటేశ్వర్లు, తెల్లం వీరభద్రం, ఎం.డి. షార్ఫుద్దీన్, వేముల విజయ్, కోలా శశికాంత్, నూకల సంపత్, షారుక్ పాషా, పర్సబోయిన సోమలింగం, రావుల వీరభద్రం, బట్టి వెంకన్న, బాలిన నరేష్, రావులపల్లి నరసింహారావు, కుర్రం పిచ్చయ్య, వంగూరి మధు, కుర్రం నరసింహారావు, మురికిపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ పాలటెక్నిక్ కళాశాలల్లో చేరికలు పెంచాలి

❖ *భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్*

**దశ, కొత్తగూడెం:** పాలిటెక్నిక్ కళాశాలలు మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో పాలిటెక్నిక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అడ్మిషన్లపై కళాశాల ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించేలా పాలిటెక్నిక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఆధునిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

ముఖ్యంగా మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో నమోదు కావడం లేదని పేర్కొన్నారు. చేరికలు పెరిగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, మౌలిక సదుపాయాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల వైపు ఆకర్షించే చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి కళాశాల నిర్దేశిత ప్రవేశాల లక్ష్యాలను సాధించేందుకు ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి అడ్మిషన్ల శాతం పెంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సులకు సంబంధించి గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, పాలిటెక్నిక్ మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

